Nava Telangana Date :- 02/06/2023

# నగరానికే తలమానికం మెట్రో

- పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మెట్రో సేవలు
- ఎయిర్‌పోర్టు ఎక్స్‌ప్రెస్ మెట్రో కారిడార్‌తో ప్రపంచ ఖ్యాతి!
- తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం



**నవతెలంగాణ-సిటీబ్యూరో**

నగర ప్రజా రవాణా వ్యవస్థలో నూతన శకానికి హైదరాబాద్ మెట్రో రైలు శ్రీకారం చుట్టింది. మెట్రో రైలు ప్రారంభంతో నగర ప్రజల జీవనశైలిలో గణనీయమైన మార్పు వచ్చింది. అలాగే మెట్రో నిర్మాణాలు నగరానికి కొత్త అందాలను తెచ్చాయి. మెట్రో స్టేషన్లు ఆధునిక విమానాశ్రయాలను తలపిస్తున్నాయి. హైదరాబాద్ మెట్రోలో అంతర్జాతీయ ప్రమాణాలతో మౌలికవసతులు కల్పించారు. ఆధునిక మౌలికవసతుల కల్పనలో హైదరాబాద్ మెట్రో ప్రపంచ దేశాల్లోని ప్రముఖ నగరాల సరసన నిలిచింది. మెట్రో రైలు ఎందరికో ట్రాఫిక్ కష్టాల నుంచి ఊరటనిచ్చింది. ప్రతి ఒక్కరూ తమ గమ్యాన్ని సరైన సమయానికి చేరుకుంటున్నారు. నగరంలో కాలుష్యం తగ్గడంతో పాటు వాహనాల ప్రమాదాలు తగ్గాయి. మెట్రోస్టేషన్లను అత్యంత సుందరంగా, స్థానికులు సేదతీరేలా అభివృద్ధి చేశారు. మెట్రో స్టేషన్ సమీపంలో విద్యుత్ కార్లు, చార్జింగ్ పాయింట్లు, బస్ బేలు, కార్లు, ద్విచక్ర వాహనాల పార్కింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రపంచవ్యాప్తంగా అమలులో ఉన్న అత్యాధునిక టెక్నాలజీ హైదరాబాద్ మెట్రోలో వినియోగించారు. హైదరాబాద్ మెట్రోరైలు ఢిల్లీ మెట్రో రైలు తర్వాత దేశంలోని రెండవ అతిపెద్ద మెట్రోగా గుర్తింపు పొందింది.

**పీపీపీ విధానంలో..**

హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టు ప్రయివేటు-పబ్లిక్ భాగస్వామ్యంలో నిర్మించిన ప్రపంచంలోనే అతిపెద్ద మెట్రో రైలు వ్యవస్థ. మొత్తం 69 కి.మీ పరిధిలో డిజైన్, బిల్డ్, ఫైనాన్స్, ఆపరేట్, ట్రాన్స్‌ఫర్(డీబీఎఫ్ఓటీ) విధానంలో మెట్రో రైలుమార్గాన్ని నిర్మించారు. మొత్తం ప్రాజెక్టు ఖర్చు రూ.22వేల కోట్లు. మూడు కారిడార్లు కలిపి 57 మెట్రో స్టేషన్లు ఉండగా.. 3 ఇంటర్ ఛేంజ్ స్టేషన్లు ఉన్నాయి. ఇందులో కారిడార్-1 మియాపూర్ నుంచి ఎల్బీనగర్ 29 కి.మీ.. 27 స్టేషన్లు.. కారిడార్-2 జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ వరకు..11 కి.మీ 8 స్టేషన్లు(పాతబస్తీ మెట్రో విస్తరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి.) ఇక కారిడార్-3 నాగోలు నుంచి రాయదుర్గ్ వరకు 29 కి.మీ 22 స్టేషన్లు ఉన్నాయి. ఈ మూడు కారిడార్లలో మెట్రో రైల్ సేవలు 2017 నుంచి విడుతల వారిగా నగరవాసులకు అందుబాటులోకి వచ్చాయి. మెట్రో స్టేషన్‌లలో ఉచిత వైఫై సౌకర్యం, మహిళలకు ప్రత్యేక సీట్లు కేటాయించారు. మెట్రోలో ప్రయాణిస్తున్న సీనియర్ సిటిజన్లు, మహిళలు, విద్యార్థులు, యువత, అధికారులు.. ఇతరులు ముక్తకంఠంతో తమ హర్షం వ్యక్తపరుస్తున్నారు.

**మెట్రో నంబర్ వన్**

మెట్రో స్టేషన్ల నిర్వాహణ, రైళ్ల సమయపాలనలో మూడేండ్ల క్రితం కియోలిస్ సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ సర్వేలో హైదరాబాద్ మెట్రో లండన్, మెట్రర్స్ స్టాకరామ్, మాంచెస్టర్, బోస్టన్ వంటి 12 అంతర్జాతీయ నగరాలను అధిగమించి మొదటి స్థానంలో నిలిచింది. విశ్వనగరాలలో కంటే హైదరాబాద్ మెట్రో అత్యాధునిక, విశిష్ట, సేవలందిస్తోందని, ఇక్కడ ప్రయాణీకులు అత్యధిక శాతం మెట్రో సేవలతో సంతృప్తి చెందుతున్నారని కియోలిస్ ప్రకటించింది.

**సమయం ఆదా..!**

నగర ట్రాఫిక్‌లో ఏ వాహనాన్నైనా వేగంగా నడపటం అసాధ్యమైన విషయం. కానీ, మెట్రో ప్రయాణం సాఫీగా సాగిపోతుంది.. ఇలా.. ఎల్బీనగర్ నుంచి మియాపూర్ మార్గంలో మెట్రో రైల్లో ప్రయాణిస్తే కేవలం 52 నిముషాల వ్యవధిలో గమ్యాన్ని చేరుకోవచ్చు. నాగోల్ నుంచి రాయదుర్గ్(29కి.మీ) మార్గంలో మెట్రో రైల్లో ప్రయాణిస్తే కేవలం 50 నిముషాల వ్యవధిలో గమ్యాన్ని చేరుకోవచ్చు.జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్(11 కి.మీ) మార్గంలో మెట్రోలో ప్రయాణిస్తే, కేవలం 16 నిముషాల్లోనే గమ్యాన్ని చేరుకోవచ్చు. మెట్రో ద్వారా ఈ రూట్లో ప్రయాణీకుల సమయం ఒక గంటకుపైగా ఆదా అవుతోంది. హైదరాబాద్ మెట్రో రైళ్లలో సగటున రోజుకి 4.5 లక్షలకు పైగా ప్రజలు ప్రయాణిస్తున్నారు.

**వేగంగా ఎయిర్‌పోర్టు మెట్రో పనులు..**



సీఎం కేసీఆర్ దార్శనిక నాయకత్వంలో రెండో దశలో ఎయిర్‌పోర్ట్‌కు అనుసంధానంగా 31కి.మీ మెట్రో రైలు మార్గ నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఎయిర్‌పోర్ట్ మెట్రో కారిడార్-31 కి.మీ మెట్రో రైలు మార్గ నిర్మాణానికి 2022 డిసెంబర్ 9న సీఎం కేసీఆర్ శంకుస్థాపన చేశారు. ఇందుకు సంబంధించిన పనులు చకాచకా సాగిపో తున్నాయి. ఎయిర్‌పోర్టు మెట్రో ప్రాజెక్టుకు ఈపీసీ కాంట్రా క్టర్ ఎంపిక కోసం(ఇంజనీరింగ్, సేకరణ, నిర్మాణం) హెచ్ఏఎంఎల్ గ్లోబల్ టెండర్లను ఆహ్వానించింది. ఈ ప్రాజెక్టు విలువ మొత్తం రూ.6,250 కోట్లు కాగా.. ఇందులో రూ.5,688 కోట్లు మెట్రో ఎక్స్‌ప్రెస్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం కోసం వినియోగించగా.. మిగిలిన రూ.562 కోట్లు భూగర్భ సామర్థ్య పరీక్షలు, పెగ్ మార్కింగ్ తదితర పనుల కోసం ఖర్చు చేయనున్నారు. ఒక భూగర్భ మెట్రో స్టేషన్‌తో కలిపి మొత్తం 9 స్టేషన్లు ఉంటాయి. సీఎం కేసీఆర్ ఆశయాలకు అనుగుణంగా నగర శివార్లలో ఉండే మధ్య తరగతి వర్గాలవారి కోసం తక్కువ ఖర్చుతో నివాసయోగ్యాల అభివృద్ధిపరచి, అన్ని తరగతులవారు ఎయిర్‌పోర్ట్ మెట్రో లైన్ ద్వారా నగరంలోని వారి ఆఫీసు లకు చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇక ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన ఈపీసీ టెండర్ డాక్యుమెంట్లను తయారు చేసేందుకు జనరల్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌గా సిస్ట్రా, రైట్స్ డీబీ ఇంజినీరింగ్ సంస్థల కన్సార్టియంను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. పలు విభాగాల్లో నిష్ణా తులైన 18మంది ఇంజినీరింగ్ నిపుణులు, క్షేత్రస్థాయిలో మరో 70మంది సీనియర్ ఇంజినీర్లు తదితర సిబ్బందిని కన్సార్టియం సమకూర్చుతుంది. ఇప్పటికే పనిని ప్రారంభించింది.

**'ప్రజారవాణా'లో మెట్రో కీ రోల్ :**

రాష్ట్రంలోనే మూడొంతుల జనాభా నగరం చుట్టుపక్కల నివసిస్తోంది. దానికి అనుగుణంగా ప్రజా రవాణా కల్పించడంలో మెట్రో రైల్ కీలక పాత్ర పోషిస్తుంది. త్వరలోనే శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ వరకు 31 కి.మీ మెట్రో ఎక్స్‌ప్రెస్ కారిడార్‌ను నిర్మిస్తాం. హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తాం.

ఎన్వీఎస్‌రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ హెచ్ఎంఆర్ఎల్